

స్వర్ణ రథంపై వరసిద్ధుడు
కాణిపాకంలో వరసిద్ధి వినాయకస్వామి బుధవారం రాత్రి స్వర్ణ రథంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. - 8లో



చిరుత సంచారం
పూతలపట్టు మండలంలో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. - 8లో



తాడేపల్లిగూడెంలో గణపతి హోమం
తాడేపల్లిగూడెం బలునులమ్మ దేవస్థానంలో వరసిద్ధి వినాయకస్వామి ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్తగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి



తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్తగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఈయన ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గాను, చంద్రగిరి శాసనసభ్యునిగా, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఉన్నారు. పార్టీలో పలు కీలక బాధ్యతలను చెవిరెడ్డి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. గతంలో తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం అయిన చంద్రగిరి నుంచి 2014, 2019లో శాసనసభ్యునిగా ఘన విజయం సాధించారు. ఇటీవల వైఎస్సార్ సీపీ ఒంగోలు, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గాల కోఆర్డినేటర్‌గా చెవిరెడ్డిని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించారు. తాజాగా చెవిరెడ్డి భాస్కర రెడ్డిని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్తగా ప్రకటించడంతో పార్టీలో నూతనోత్సాహం నెలకొంది.

వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు ఇన్‌చార్జిగా కృపాలక్ష్మి



కళత్తూరు కృపాలక్ష్మి

సాక్షి, చిత్తూరు: వైఎస్సార్‌సీపీ గంగాధర నెల్లూరు ఇన్‌చార్జిగా కళత్తూరు కృపాలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ప్రస్తుతం జీడీ నెల్లూరు నియోజకవర్గానికి ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఈయన పెద్ద కుమార్తె కృపాలక్ష్మి తండ్రి రాజకీయాలకు చేదోడువాదోడుగా నిలిచారు. ఫిజియో థెరపీలో డిగ్రీ పొందిన ఈమె ప్రస్తుతం న్యాయవిద్యను అభ్యసిస్తున్నారు. తాజాగా నారాయణస్వామి విన్నపం మేరకు కృపాలక్ష్మిని వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు.

పకడ్బందీగా 'మినహాయింపు'

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగుల విధుల మినహాయింపు ప్రక్రియను కలెక్టరేట్‌లో పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ పరిధిలోని టీచర్ల విధుల మినహాయింపు వెరిఫికేషన్ బుధవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య స్వయంగా ప్రక్రియను పరిశీలిస్తున్నారు. బుధవారం 372 నుంచి 658 వరకు 287 మంది టీచర్ల వెరిఫికేషన్‌ను పూర్తి చేశారు. ఈ నెల 29వ తేదీన తయారు చేసిన జాబితా ప్రకారం 659 నుంచి 944 వరకు టీచర్ల వెరిఫికేషన్ చేయనున్నారు. ఎన్నికల కమిషన్ మినహాయింపుల నిబంధనల ప్రకారం ముందస్తుగా కలెక్టరేట్ అధికారులు జాబితాను సిద్ధం చేశారు. ఆ జాబితాను అనుసరించి టీచర్లను స్వయంగా పరిశీలించి, వారు అందజేసే ధ్రువీకరణ పత్రాలను చూసిన తర్వాతే ఎన్నికల విధులను రద్దు చేసే ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

విధి విధానాలు తప్పనిసరిగా పాటించాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల కోడ్ ప్రారంభం కాగానే ఎన్నికల విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు పకడ్బందీగా జరుగుతున్నాయన్నారు. నామినేషన్ల పర్వం ప్రారంభమయ్యే వారం రోజుల ముందు వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఎన్నికల సామగ్రిని ఆయా నియోజకవర్గ కేంద్రాల నుంచి పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పంపిణీకి పుంగనూరు బీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నగరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జీడీ నెల్లూరు జెడ్పీ హైస్కూల్, పూతలపట్టు ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల, పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం ఎంఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధుల నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, అట్లూరి శ్రీనివాసులు, పరదేశి, వినాయకన్, గంగరాజు, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమరం.. ఫ్యాన్ సిద్ధం



శాంతిపురం మండలంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సభలో కార్యకర్తల ఉత్సాహం(ఫైల్)

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ సమరోత్సాహంతో ముందుకు సాగుతోంది.. యావత్ పార్టీ యంత్రాంగం ఫుల్ జోష్‌తో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తోంది.. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని వివరిస్తోంది.. సిద్ధం సభల ద్వారా ప్రజల నాడి తేటతెల్లం కావడంతో రెట్టించిన ఉత్తేజంతో దూసుకెళుతోంది.. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా జనంతో మమేకమవుతోంది.. అత్యధిక మెజారిటీలు సాధించి విజయదుందుభి మోగించేందుకు సన్నద్ధమవుతోంది.. ఇదే సమయంలో పచ్చసేన మాత్రం పొత్తుల చిక్కులతో చిత్తవుతోంది.. అసంతృప్తులను బుజ్జగించేందుకు నానా అవస్థలు పడుతోంది.. గోడదూకేందుకు సమాయత్తమవుతున్న నేతలను ప్రసన్నం చేసుకునేందుకు మల్లగుల్లాలు పడుతోంది.

- జోరుగా వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం
- క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న సంక్షేమ సైన్యం
- పొత్తులతో చిత్తవుతున్న టీడీపీ, జనసేన
- ఆందోళనలో పచ్చసేన శ్రేణులు
- గోడ దూకేందుకు సన్నద్ధమవుతున్న టికెట్ ఆశించి భంగపడిన నేతలు
- అసంతృప్తుల చుట్టూ తిరుగుతున్న టీడీపీ అభ్యర్థులు



సాక్షి, తిరుపతి : ఎన్నికలు సమీపిస్తుండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికార వైఎస్సార్ కాంగ్రెస్‌లో ఫుల్ జోష్ కనిపిస్తోంది. ఓ వైపు అభివృద్ధి.. మరో వైపు సంక్షేమ పథకాలతో సుపరిపాలన అందించి శభాష్ అనిపించుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు రంగంలోకి దిగారు. వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కుప్పం నుంచి గూడూరు వరకు 'ఫ్యాన్'కు తిరుగులేదని నిరూపించేందుకు 'సిద్ధం' అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ ఏ కార్యక్రమం నిర్వహించినా అనూహ్య స్పందన లభించడమే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు. అందులో భాగంగానే అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభకు చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారని వెల్లడిస్తున్నారు. కరోనా కష్ట కాలంలో దిక్కులేని ఎంతో మందికి ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులుఅండగా నిలవడాన్ని జనం గుర్తుచేసుకుంటున్నారని వివరిస్తున్నారు. ఇదే క్రమంలో ప్రజలు సైతం ఆపత్కాలంలో ఆదుకున్న వారికే తమ మద్దతు అని స్పష్టం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు అపూర్వ ఆదరణ

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఓ వైపు.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మరో వైపు ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకోవటంతో పాటు.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని విచారిస్తున్నారు. ఇంటింటికీ వెళుతున్న మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, గురుమూర్తి, రెడ్డెప్ప, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, మరో వైపు చెవిరెడ్డి లక్ష్మి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆయా నియోజక వర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. తిరుపతిలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఓ వైపు, నియోజక వర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మరో వైపు పర్యటిస్తున్నారు. వెంకటగిరిలో పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, కుమార్తె పవిత్రారెడ్డి, సూళ్లూరుపేటలో కిలివేటి సంజీవయ్య, గూడూరులో మేరిగ మురళీధర్, చిత్తూరులో విజయానందరెడ్డి, కుప్పంలో ఎమ్మెల్సీ భరత్, పలమనేరులో వెంకటేగౌడ, పూతలపట్టులో డాక్టర్ సునీల్‌కుమార్, సత్యవేడులో రాజేష్ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. వీరికి తోడుగా మేము సైతం అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెంట నడుస్తూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరుతున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. సచివాలయాలు, రైతు భరోసా, హెల్త్ క్లినిక్‌లు ఇదే స్థాయిలో సేవలందించాలన్నా.. వలంటీర్ వ్యవస్థ ఉండాలన్నా.. పుష్కలంగా వర్షాలు కురిసి ఉమ్మడి జిల్లా పంటలతో కలకళలాడాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిస్తున్నారు.

కుప్పంలో వైఎస్ జగన్‌కు నీరా'జనం'

పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా.. ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు చంద్రబాబు కనీసం తాగు నీరు కూడా ఇవ్వలేకపోయారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేవలం 57 నెలల కాలంలోనే హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చి కుప్పం ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు. కృష్ణా జలాలు విడుదల సందర్భంగా మూడు రోజుల క్రితం కుప్పంలో పర్యటించిన సీఎం వైఎస్ జగన్‌కు నియోజక వర్గ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు.సీఎం రాకతో గుండిశెట్టిపల్లె రాజుపేట వద్ద స్థానికులు అడుగడుగునా నీరాజనం పట్టారు. కరువు కాటకాలతో అల్లాడుతున్న పడమటి ప్రాంతానికి నీళ్లు తీసుకొచ్చిన దేవుడని సీఎం వైఎస్ జగన్‌ని కీర్తిస్తున్నారు. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని టీడీపీ అండ్ కో దుష్ప్రచారానికి తెరతీయించింది. కరువు సమయంలో కూడా కృష్ణా నీటిని తీసుకొచ్చినందుకు ఆనందించకుండా బురద జల్లటమే ధ్యేయంగా టీడీపీ అండ్ కో పనిచేస్తుండడంపై స్థానికులు మండిపడుతున్నారు. కాలువలో నీరు ప్రవహిస్తున్నా టీడీపీ అండ్ కో ఇంత నీచానికి దిగుతారా? అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బోయకొండలో లక్ష కుంకుమార్చన



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

చౌడేపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయంలో ప్రతి ఏటా మాఘమాసంలో వైభవంగా నిర్వహించే లక్ష కుంకుమార్చన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఆలయంలో గత 15 యేళ్లగా హిందూ సంప్రదాయ రీతిలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు చేసి లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు రోజులపాటు సాగే కుంకుమార్చనలో భాగంగా అమ్మవారి ఉత్సవ మూర్తి ఎదుట ప్రత్యేక పూజలు, గణపతి, చండీహోమం, మహా మంగళహారతి చేశారు. రూ.1500 చెల్లించిన దంపతులు ఇందులో పాల్గొనవచ్చు. ఈ పూజా కార్యక్రమానికి 67 జంటలు హాజరయ్యాయి. అనంతరం ఉభయదారులకు అమ్మవారి వెండి నాణెంతోపాటు శేషవస్త్రం, తీర్థప్రసాదాలను దంపతులకు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజ రెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు రాజేష్, బుడ్డమ్మ పాల్గొన్నారు.



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయదారులు

సీఎం ప్రత్యేక చొరవతోనే అభివృద్ధి



సదుం: షాదీమహల్ ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి



సోమల: ఏఎంసీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

సదుం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పుంగనూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సదుం, సోమల మండలాల్లో రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ రెడ్డెప్పతో కలసి మంత్రి బుధవారం ప్రారంభించారు. పూర్తయిన అభివృద్ధి పనులను చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో నియోజకవర్గంలో ఎప్పుడూ లేనంత అభివృద్ధి చేసి చూపించామన్నారు. సీఎం చొరవతో చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిని ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

హంద్రీ–నీవాపై విష ప్రచారం

హంద్రీ–నీవా కాలువ పనులు పూర్తి కాలేదని పచ్చ మీడియా పదే, పదే విష ప్రచారం చేస్తోందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తవడంతో నియోజకవర్గంలో ఒక చెరువు కూడా నిండిందని ఆయన తెలిపారు. కాలువలో ధర్నాలు అంటూ ఓవర్ యాక్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. సాంకేతిక బృందాన్ని తీసుకువచ్చి కాలువ పనులు పూర్తయ్యాయో లేదో పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు, ఈఓపీఆర్‌డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

123 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : టెట్ రెండో రోజు పరీక్షకు 123 మంది గైర్హాజరైనట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని మూడు, తమిళనాడులోని ఒక పరీక్ష కేంద్రంలో రెండు సెషన్స్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు 994 మందికి గాను 871 మంది హాజరైనట్లు డీఈఓ వెల్లడించారు.

ఆరు ప్రాంతాల్లో సురక్ష

చిత్తూరు రూరల్: జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. క్యాంపునకు జనం క్యూకట్టారు. మొత్తం 2,814 ఓపీలు రాగా 19 మంది డాక్టర్లు వారికి చికిత్స చేశారు. జనరల్‌కు 1205, గైనిక్‌కు 429, చిన్న పిల్లల ఓపీకి 104, ఆర్థోకు 609, డెంటల్ 32, చర్మం 101, కంటి సమస్యలకు 194, ఇతర సమస్యలకు 140 ఓపీలు వచ్చాయి. 31 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు.

అన్నదాతలకు సర్కారు సాయం

- వరుసగా ఐదో ఏడాది నగదు జమ
- వర్చువల్ విధానంలో సీఎం ప్రసంగం వీక్షించిన రైతాంగం
- వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకంలో రూ.7.5 కోట్లు జమ
- వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకంలో 2,31,197 మందికి రూ.46.31 కోట్లు జమ



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : అన్నదాతలకు సర్కారు ప్రతి ఏటా రైతు భరోసా సాయం అందిస్తోందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రామచంద్రారెడ్డి అన్నారు. వరుసగా ఐదో ఏడాది ఈ ఏడాదికి మూడవ విడతగా బుధవారం వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ పథకాలను వర్చువల్ విధానంలో సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో నగదును ప్రభుత్వం జమ చేస్తోందని చెప్పారు. ప్రతి ఏటా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న రూ.13,500 నగదు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకంలో జిల్లాకు చెందిన 26,961 మంది రైతులకు గాను రూ.7.5 కోట్లు, రైతు భరోసా, పీఎం కిసాన్ పథకంలో జిల్లాకు చెందిన 2,31,197 మంది రైతులకు గాను రూ.46.31 కోట్లను సీఎం డీబీటీ విధానంలో రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు వివరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలన్నీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. రైతులు చక్రవడ్డీల పద్మ వ్యూహంలో చిక్కుకోకుండా ప్రతి ఏటా వారికి వైఎస్సార్ రైతు భరోసా, పంట రుణాలు పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, జెడ్పీ స్త్రీ శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ భారతి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ, పలు ప్రాంతాల నుంచి రైతులు పాల్గొన్నారు.

గతంలో ఎన్నడూ లేదు



మా కుటుంబానికి గతంలో ఎన్నడూ ఇంతలా మేలు జరగలేదు. పంటల సాగు కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం అలాంటి ఇబ్బందులేవి మాకు లేవు. సర్కారు మా పట్ల చూపుతున్న ప్రేమ, చేస్తున్న మేలు ఎంతో గొప్పది. గతంలో మూడు సార్లు రైతు భరోసా అందుకున్నా. నా పిల్లలకు అమ్మఒడి, ఫీజు రీయంబర్స్‌మెంట్ సహాయం అందుతోంది. జగనన్నకు రుణపడి ఉంటాం. – అంబికాగాంధీ, యాదమరి మండలం

అప్పు చేసే బాధ తప్పింది



గతంలో పంటలు పండించాలంటే మాకు అంత ఆర్థిక స్థోమత లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి. ప్రతి ఏటా రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాల లబ్ధిని పొందుతున్నాను. ఆ నగదుతో పంటలు పండించుకుని లబ్ధి పొందుతున్నాం. ఈ పథకాలతో పాటు మా కుటుంబంలో అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, ఆసరా పథకాలను పొందుతున్నాము. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇంతలా సాయం చేయలేదు. – ప్రమీల, బంగారుపాళెం

క్లుప్తంగా

పూతలపట్టులో చిరుత సంచారం

పూతలపట్టు: మండలంలోని బైటపల్లి పంచాయతీ రామాపురం, మద్దులయ్యగారిపల్లి ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు అధికారులకు తెలిపారు. స్పందించిన అటవీ సిబ్బంది రామాపురం, మద్దులయ్యగారిపల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో పరిశీలించారు. పంచాయతీ ప్రజలను అప్రమత్తం చేశారు. పశువుల కాపరి పొలాల్లో తిరుగుతున్న పులిని చూసినట్లు తెలిపారు. సాయంత్రం గ్రామస్తులకు అటవీ అధికారులు సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. బయట పనికి వెళ్లే గ్రామస్తులు సాయంత్రం 6 గంటల్లోపు ఇంటికి చేరుకోవాలని సూచించారు. చిరుత పులి చూస్తే వెంటనే అధికారులకు, వలంటీర్లకు, గ్రామపెద్దలకు తెలియజేయాలని సూచించారు. సర్పంచ్ రామతులసి ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. పొలం పనులకు వెళ్లే గ్రామస్తులు ఒంటరిగా రాకుండా గుంపుగా వెళ్లాలని సూచించారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.



అలవోకగా ఆంగ్లం

- 'బెండపూడి'ని తలపిస్తున్న పలమనేరు గర్ల్స్ స్కూల్
- ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడుతున్న విద్యార్థినులు
- నాడు–నేడుతో సౌకర్యాల్లోనూ ఉన్నతంగా పాఠశాల

పలమనేరు : రాష్ట్రంలోని బెండపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడం మనందరం చూశాం. అదే బాటలో ఇప్పుడు చిత్తూరు జిల్లాలోని పలమనేరు బాలికోన్నత పాఠశాల చేరింది. ఇక్కడి విద్యార్థినులు అవలీలగా ఆంగ్లంలో మాట్లాడేస్తున్నారు. జిల్లాలోనే వెనుకబడిన నియోజకవర్గమైన పలమనేరులోని సర్కారు బడి పిల్లలే ఇంగ్లిషులో ఇలా పట్టు సాధించారంటే.. ఇక రాష్ట్రంలోని మిగతా బడుల్లోని పిల్లలు భవిష్యత్తులో ఎన్ని అద్భుతాలు సృష్టిస్తారో అంచనా వేయొచ్చు.

ఒకప్పుడు సమస్యల వలయం

పట్టణంలోనే పురాతన బడిగా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు పేరుంది. ఇక్కడ ఏటా 1,000 మంది దాకా బాలికలు విద్యనభ్యసిస్తుంటారు. ఈ పాఠశాలలో గతంలో తాగునీటికి కూడా విద్యార్థినులు ఇబ్బంది పడేవారు. అసలే బాలికలు చదివే బడి.. అయినా మూత్రశాలలు చాలినన్ని లేక వారి కష్టాలు వర్ణనాతీతం. కూలేందుకు సిద్ధంగా ఉన్న గదులు, పగుళ్లు తీసిన ప్రహరీగోడలు.. ఇలా చెప్పుకొంటూ పోతే అన్నీ సమస్యలే.

'నాడు–నేడు'తో సకల సౌకర్యాల నిలయం


పలమనేరు బాలికోన్నత పాఠశాల

నాడు–నేడు ఫేజ్–1 ద్వారా ఈ పాఠశాలకు రూ.60 లక్షలు మంజూరైంది. ఫేజ్–2 ద్వారా రూ.3 కోట్లు మంజూరైంది. ఈ నిధులతో బడిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. శిథిలావస్థలోని తరగతి గదుల స్థానంలో కొత్త గదులు, పిల్లలకు అవసరమైనన్ని టాయ్‌లెట్లు, మరుగుదొడ్లు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్, బడిలో కొత్త ఫర్నిచర్, పిల్లలకు డెస్కులు, గ్రానైట్, పార్కింగ్ టైల్స్ ఇలా మేజర్, మైనర్ మరమ్మతులు అన్నీ పూర్తి చేశారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, కలర్ డెస్కులు, లైట్లు, చక్కటి వాల్‌పెయింటింగ్స్, గ్రీన్ చాక్‌బోర్డులు ఇలా కార్పొరేట్ సౌకర్యాలు సమకూరాయి. గతంలో నుంచి టాప్ మార్కులు సాధించే ఈ బాలికోన్నత పాఠశాల.. ఇప్పుడు టాప్ సౌకర్యాల పాఠశాలగా కార్పొరేట్ బడిని తలదన్నేలా తయారైంది. ఇప్పుడీ బడిలో 986 మంది చదువుతున్నారు. వీరికి అన్ని రకాల సౌకర్యాలు, నాణ్యమైన భోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్ తదితరాలు అందాయి. అన్ని తరగతుల్లోనూ డిజిటల్ బోర్డులు(ఐఎఫ్‌పీ), బైజూస్ ద్వారా పిల్లలతో పాటు టీచర్లకు 450 దాకా ట్యాబ్‌లిచ్చారు. ఆంగ్ల మాధ్యమం అందుబాటులోకి రావడంతో టీచర్లు తరగతి గదిలో కేవలం ఇంగ్లిషులోనే పిల్లలతో మాట్లాడడం, మాట్లాడించడం వల్ల వారు ఇంగ్లిషులో పట్టుసాధించారు. దీంతో పాటు విద్యా బోధన సైతం ఆంగ్లమాధ్యమంలోనే కొనసాగుతుండడంతో వీరు అలవోకగా ఇంగ్లిషు మాట్లాడడం నేర్చుకున్నారు.



నాడు–నేడుతో ఏర్పాటైన ఆర్వో ప్లాంట్ తాగునీరు, కొత్త మరుగుదొడ్లు, కొళాయిలు

మా పేరెంట్స్ గర్వపడుతున్నారు


నేను ప్రైవేటు స్కూల్‌లో చదివి.. ఎనిమిదో తరగతిలో ఇక్కడ చేరా. ఇది కార్పొరేట్ స్కూల్ కంటే మిన్నగా ఉంది. మేం ఇప్పుడు ఇంగ్లిషు సైతం చక్కగా మాట్లాడుతున్నాం. నన్ను చూసి మా పెద్దలు గర్వంగా ఫీలవుతున్నారు.

– యమున, 8వ తరగతి

అడ్మిషన్లు పెరిగాయి


ప్రభుత్వం ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడంతో మా బడిలో అడ్మిషన్లు బాగా పెరిగాయి. వీరంతా ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతున్నారు. ఇంగ్లీషుపై పట్టు లేకుంటే వెనకపడతారని వారికి స్పష్టంగా చెప్పాం.

– లత, హెచ్‌ఎం, గర్ల్స్ హైస్కూల్, పలమనేరు

ఇంగ్లీషు మాట్లాడడం వచ్చింది


గతంలో తాగేందుకు మంచినీళ్లు కూడా ఉండేవి కావు. ఇప్పుడు హాయిగా ఆర్వో ప్లాంట్‌లో మినరల్ వాటర్ తాగుతున్నాం. గతంలో వానొస్తే బడి మొత్తం చెరువులా మారేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. ఓ కార్పొరేట్ స్కూల్ కంటే మా బడి పదిరెట్లు బాగుంది. టీచర్ల కృషితో మాకు ఇంగ్లీషు బాగా మాట్లాడడం అబ్బింది.

– అమూల్య, 10వ తరగతి

జగన్ మామకు థ్యాంక్స్


మేం మా క్లాస్‌మేట్స్‌తో ఇంగ్లిషులోనే మాట్లాడతాం. మా యూనిఫామ్, షూ, అనర్గళంగా మేం మాట్లాడుతున్న ఇంగ్లిషును చూస్తే మాకే చాలా గర్వంగా ఉంది. మా తల్లిదండ్రులు సైతం చాలా సంతోషంగా ఉన్నారు. జగన్ మామకు థ్యాంక్స్.

– ప్రవల్లిక, 9వ తరగతి

సబ్జెక్టులపై పట్టు పెరిగింది


ఆంగ్లం రావడం వల్ల మాకు సబ్జెక్టులపై పట్టు పెరిగింది. జనరల్‌గా సబ్జెక్ట్‌ను ఇంగ్లిషులో రాయడం కూడా వచ్చింది. మా బడిలో మా ఫ్రెండ్స్ అంతా ఇంగ్లిషులో మాట్లాడుతూ ఉంటే చాలా సంతోషంగా ఉంటుంది.

– భావన, 9వ తరగతి

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

నగరి : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ నరసింహమూర్తి బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు చేపట్టే చర్యల్లో భాగంగా ఆయన రౌడీషీటర్లతో సమావేశమయ్యారు. ఎన్నికల సమయంలో ఎలా నడుచుకోవాలో వివరించారు. లేకుంటే ఎలాంటి చర్యలు తీసుకోవాల్సి వస్తుందో వారికి విపులంగా తెలియజేశారు. పూర్తి స్థాయిలో తమ నిఘా ఉంటుందని దానికనుగుణంగా నడచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల్లో విద్యుత్ ఆదా అవసరం


మాట్లాడుతున్న గోవర్ధన్ బాబి

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలోని ఆహార సంబంధిత పరిశ్రమల్లో విద్యుత్‌ను ఆదా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య కార్యదర్శి గోవర్ధన్ బాబి తెలిపారు. స్థానిక కేబీఆర్ మ్యాంగో భవన్‌లో బుధవారం అపిట్కో లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆహార సంబంధిత పరిశ్రమల ప్రతినిధులతో పరిశ్రమల్లో విద్యుత్ ఆదాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో ఎంత మేరకు విద్యుత్‌ను ఉపయోగించుకోవాలి అన్నదానిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేగాక విద్యుత్ మోటార్లను వృథాగా ఉపయోగించకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. పరిశ్రమల్లో సామర్థ్యం కలిగిన నాణ్యమైన యంత్రాలను ఉపయోగించడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేసుకుని, చార్జీల భారం తగ్గించుకోవచ్చన్నారు. దీనిపై జిల్లాలోని పరిశ్రమలను సందర్శించి అక్కడి కార్మికులకు విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సదస్సులో అపిట్కో అధికారులు శ్రీనివాస్ రావు, గోపాల్ రావు, టెక్నికల్ అధికారి అహ్మద్, జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు బాలకష్టారెడ్డి, తలపులపల్లి బాబు రెడ్డి, పండ్ల పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో గణపతిహోమం




బలుసులమ్మ దేవస్థానంలో గణపతి హోమానికి హాజరైన భక్తులు, హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కాణిపాకం: దేవదాయ ధర్మాదాయ శాఖ పరిషత్, కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో తాడేపల్లి గూడెంలోని శ్రీ బలుసులమ్మ దేవస్థానంలో బుధవారం గణపతిహోమం, సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. రెండు రోజుల క్రితం కాణిపాక ఆలయం నుంచి తాడేపల్లె గూడేనికి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రచార రథంలో కొలువుదీర్చి తీసుకెళ్లారు. ఉదయం తాడేపల్లె గూడెంలోని శ్రీ బలుసులమ్మ ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ఆలయ అధికారులు, ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం కాణిపాక ఆలయ అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా గణపతి హోమం, సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై వ్రతం ఆచరించారు. ఈ పూజాధి కార్యక్రమాలకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మంత్రికి ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, ఆలయ అర్చక వేదపండితులు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ కోసం కోకా కుయుక్తులెన్నో?

- మద్యం తరలిస్తూ పట్టుబడిన వైనం
- సీఐ దాడి చేశాడంటూ నానా హంగామా
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇతనిపై ఆరు కేసులు


నారా లోకేష్‌తో నిందితుడు ప్రకాష్ నాయుడు (ఫైల్)

పలమనేరు/బంగారుపాళెం : వచ్చే ఎన్నికల్లో పూతలపట్టు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి కోసం కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ బంగారుపాళెం మండలానికి చెందిన గొల్లపల్లి సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడిని పలమనేరు పోలీసులు బుధవారం అరెస్ట్ చూపారు. కోకాను అరెస్ట్ చేశాక పలు విషయాలు పోలీసుల విచారణలో వెలుగుచూశాయి. కేవలం ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలుపుకోసం ప్రభుత్వంపై కోకా ఎన్నో కుయుక్తులు పన్నినట్టు స్పష్టం అవుతోంది. బాగా ఆస్తిపరుడైన కోకా ప్రకాష్‌నాయుడు గతంలో మద్యం వ్యాపారం చేసేవాడు. దీంతో ఆయనకు మద్యం వ్యాపారంపై బాగా పట్టుంది. ఈ నేపథ్యంలో బంగారుపాళెం మండలం గొల్లపల్లి టీడీపీ సర్పంచ్‌గా గెలుపొందాడు. తరువాత జిల్లా టీడీపీ సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మారి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యాడు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం దొంగిలించిదంటూ నానా యాగీ చేశాడు. గతేడాది ఆగస్టులో బంగారుపాళెం మండల సాధారణ సమావేశానికి బిక్షగాడిలా హాజరై సభను అడ్డుకున్నాడు. దీనిపై స్పందించిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకోవడంతో స్టేషన్‌లో సీఐ నాగరాజరావు తనపై దాడి చేశాడని తప్పుడు ప్రచారం చేసి ఆస్పత్రిలో చేరి హంగామా సృష్టించాడు. దీంతో చంద్రబాబు వద్దకెళ్లి ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ప్రభుత్వం బురద జల్లేందుకు ప్రయత్నించాడు. ఇదే నిజమేనంటూ పూతలపట్టు టీడీపీ నాయకులు సైతం బంగారుపాళెం హైవేలో ధర్నాలు చేస్తూ హడావుడి చేశారు. ఎన్నికల కోడ్‌కు ముందే లోడ్ మద్యాన్ని తన రహస్య స్థావరాల్లో దాచే ప్రయత్నంలోనే గత కొన్నాళ్లుగా తన ఖరీదైన కార్లలో స్వయంగా కర్ణాటక నుంచి మద్యం తీసుకొస్తున్నట్టు పోలీసులకు సమాచారం ఉంది. వారం రోజుల క్రితం పోలీసుల కన్నుగప్పి మద్యం కారుతో పలమనేరులో తప్పించుకున్నట్టు పోలీసులు తెలిపారు. అయితే మంగళవారం రాత్రి అదే పలమనేరు పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనిపై బంగారుపాళెం, అలిపిరి, మదనపల్లె తదితర పోలీస్ స్టేషన్లలో ఆరు వరకు క్రిమినల్, ఎక్సైజ్ కేసులున్నట్టు పలమనేరు డీఎస్పీ మహేశ్వర్ రెడ్డి చెప్పడం గమనార్హం. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం ప్రభుత్వంపై బురద జల్లుతూ అక్రమాలకు పాల్పడే నిందితుడిని పోలీసులు అరెస్టు చేయడంతో టీడీపీ శ్రేణుల్లో గుబులు రేపుతోంది.


బంగారుపాళెంలో ధర్నా చేస్తున్న టీడీపీ శ్రేణులు(ఫైల్)

నగరిలో మసీదులకు మహర్దశ

- రూ.1.97 కోట్ల నిధులతో ఆధునికీకరణ
- ఫలించిన మంత్రి రోజా కృషి
- నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల

నగరి : నియోజకవర్గంలో ఇప్పటి వరకు చూడని అభివృద్ధి పనులు వరుసకట్టి మరీ జరుగుతున్నాయి. కులమత భేదాలు లేకుండా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాగుతోంది. చేపట్టవలసిన పనుల గుర్తింపు అందుకు అవసమైన నిధులు మంజూరు చేసుకోవడంలో మంత్రి రోజా తనకు తానే సాటిగా నిలుస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాల నిర్మాణం, ఆధునికీకరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని మసీదుల పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నవీకరణకు నిధులు మంజూరు చేయించారు. నియోజకవర్గంలోని 17 మసీదుల మరమ్మతులకు రూ.1.97 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఇంతియాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో నగరి మండలం వేలావడి మస్జిద్ ఇ మొహమ్మదీయ, ఎంఎస్ పాళెం జామియా మసీదు, ఎస్వీపురం మసీద్ రుకైయా, నగరి పట్టణంలోని జామియా మసీదు, మక్కా మసీదు పుత్తూరులోని మసీద్ ఇ మక్దాస్, జామియా మసీదు, ఈద్గామాస్క్, గౌసియా మసీదు, మసీద్ ఇ సుల్దానా, ఈద్గా మాస్క్, మసీద్ ఇ ముక్దాస్, జామియా మసీద్ వహాడా, ఖాదర్‌వలీ దర్గా, వడమాలపేటలోని అహెల్ ఇ సున్నత్ జమాత్ మసీదు, నింద్ర మండలంలోని మస్జిద్ ఇ మొహమ్మదీయ జమాద్, విజయపురం మండలం కోసలనగరంలోని మసీద్ ఈ అక్సాలకు సంబంధిత నవీకరణ పనులు జరగనున్నాయి. ఇప్పటికే పుత్తూరులో రూ.2.41 కోట్ల నిధులతో మహత్తరంగా షాదీ మహల్ నిర్మించారు. నగరిలోని షాదీమహల్ నవీకరణ చేపట్టనున్నారు. ఇదిగాక ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు 80 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇమామ్‌లకు అందించే సహాయాన్ని రూ.5 వేలు నుంచి 10 వేలకు పెంచారు. వక్ఫ్ బోర్డు, ముస్లిం మైనారిటీలకు సంబంధించిన స్థిర, చర ఆస్తులను రీసర్వే చేయించి వారి ఆస్తులను పరిరక్షిస్తున్నారు. మదర్సాలలో చదివే ముస్లిం పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారు. మోడ్రన్ ఎడ్యుకేషన్ ఇస్తున్న మదర్సాలకు అమ్మ ఒడి, విద్యా కానుక పథకాలు వర్తింపచేసింది కూడా ప్రస్తుత ప్రభుత్వమే. ఇంతలా తమకు సహకారం గతంలో ఏ ప్రభుత్వమూ అందించలేదని ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మసీదుల పరిస్థితిని వివరిస్తున్న మంత్రి ఆర్కే రోజా (ఫైల్)

స్వర్ణరథంపై వరసిద్ధుడి విహారం


వ్రతం నిర్వహిస్తున్న అర్చక వేదపండితులు, ఆచరిస్తున్న భక్తులు

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి స్వర్ణ రథంలో ఆలయ మాఢవీధులలో విహరించారు. బుధవారం రాత్రి సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామిని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ఊరేగింపుగా తీసుకొచ్చి బంగారు రథంలో కొలువు తీర్చారు. ఆలయ మాడవీధులలో మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో ఊరేగించారు.

ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాన్ని ఆలయ అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాలుగో రోజు సంకటహర చతుర్థి వ్రతం ప్రతి నెలా నిర్వహించడం సంప్రదాయం. ఈ క్రమంలో బుధవారం ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు పర్యాయాలు ఆలయంలో ఆలయ అర్చక వేదపండితులు సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. మొదటగా సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఈఓ వెంకటేశు, అధికారులు, అర్చక వేదపండితులు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆస్థాన మండపంలో కొలువుదీర్చి వ్రతాన్ని నిర్వహించారు. వ్రతం ఆచరించిన భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక స్వామివారి దర్శనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ రమేష్, వేదపండితులు అర్చకులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో సైన్స్ కేంద్రంగా 'ఐఐటీ'

ఏర్పేడు : భవిష్యత్‌లో తిరుపతి ఐఐటీ సైన్స్ అభివృద్ధి కేంద్రంగా మారబోతోందని జేఎన్‌యూ న్యూఢిల్లీ మాజీ వీసీ రూపమంజరి ఘోష్ తెలిపారు. బుధవారం మండలంలోని ఐఐటీ తిరుపతి, జంగాలపల్లె వద్ద ఐసర్ ప్రాంగణంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వందలాది మంది హాజరయ్యారు. రసాయనిక, భౌతికశాస్త్ర ప్రయోగాలను ప్రదర్శించారు. రూపమంజరి ఘోష్ మాట్లాడుతూ విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం క్వాంటమ్ ఫిజిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ అన్వేషణలోని అద్భుతాలు, ఆకర్షణీయమైన కార్యకలాపాలపై చర్చించారు.